సాక్షి తిరుపతి

ఆదివారం । 4 । జూన్ । 2023



ఫైనల్స్‌కు చేరిన చంద్రగిరి ఐపీఎల్

వైఎస్సార్ గ్రామీణ క్రికెట్ టోర్నమెంట్ మండల స్థాయి పోటీలు (చంద్రగిరి ఐపీఎల్ క్రికెట్ టోర్నీ) ఫైనల్స్‌కు చేరాయి.

- 10లో



జ్యేష్టాభిషేకం

తిరుమల: శ్రీవారి జ్యేష్టాభిషేకంలో భాగంగా శనివారం మలయప్పస్వామి వారు ముత్యపు కవచం ధరించి మురిపించారు.

- 10లో

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	36	24
చిత్తూరు	40	27
తిరుమల	36	24
గూడూరు	42	31
నగరి	42	29

న్యూస్‌రీల్

పాలిసెట్ కౌన్సెలింగ్‌కు 184 మంది హాజరు

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి కపిలతీర్థం రోడ్డులోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం 75,001వ ర్యాంకు నుంచి 92 వేల ర్యాంకు వరకు పాలిసెట్ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ కౌన్సెలింగ్‌కు 184 మంది విద్యార్థులు హాజరై తమ సర్టిఫికెట్లను పరిశీలన చేయించుకున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్, పాలిసెట్ కో–ఆర్డినేటర్ డాక్టర్ వై.ద్వారకనాథ రెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా శనివారం 92,001 నుంచి 1,08,000 వేల ర్యాంకు వరకు విద్యార్థుల సర్టిఫికెట్లను పరిశీలన చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కౌన్సెలింగ్‌కు హాజరయ్యే విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు రెండు సెట్ల జిరాక్స్ కాపీలను వెంట తెచ్చుకోవాలని ఆయన కోరారు. చీఫ్ వెరిఫికేషన్ ఆఫీసర్ సీహెచ్.శైలజ, అసిస్టెంట్ కో–ఆర్డినేటర్ ఎస్.సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు.

దొంగ అరెస్ట్



పట్టుబడిన నగలను పరిశీలిస్తున్న ఎస్పీ

తిరుపతి క్రైమ్: రాత్రి సమయంలో ఇళ్లల్లో దొంగతనాలకు పాల్పడుతున్న దొంగను అరెస్ట్ చేసినట్లు ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఎస్పీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అలిపిరి పోలీస్ స్టేషన్ పరిధిలో తొమ్మిది కేసుల్లో ముద్దాయి అయిన విశాఖపట్నం జిల్లా, సీతంపేటకు చెందిన బొడ్డు పోతుల శీను అలియాస్ సకల శీను అలియాస్ నల్ల శీను(34)ను కరకంబాడి రోడ్డు తిమ్మినాయుడుపాళెం వద్ద శుక్రవారం అలిపిరి సీఐ అబ్బన్న వారి బృందం అరెస్ట్ చేసింది. విచారణలో రాత్రి సమయంలో ఇంటి తాళాలు పగులగొట్టి దొంగతనాలకు పాల్పడుతున్నట్లు ఒప్పుకున్నట్లు ఎస్పీ తెలిపారు. అలిపిరి పోలీస్ స్టేషన్‌లో ఉన్న తొమ్మిది కేసులకు గాను అతని నుంచి 793 గ్రాముల బంగారు, 1,235 గ్రాముల వెండిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. 2010 నుంచి దొంగతనాలకు పాల్పడుతున్నట్లు విచారణలో తేలిందన్నారు. ఇతనిపై విశాఖపట్నం, రాజమండ్రి, విజయవాడ సిటీ, తిరుపతి సీసీఎస్, తిరుచానూరు పోలీస్ స్టేషన్ పరిధిలో 35 కేసులకు పైగా నమోదయ్యాయని తెలిపారు. ముద్దాయి పై పీడీ యాక్ట్ నమోదు చేసేందుకు సిఫారసు చేస్తున్నామన్నారు. ఏఎస్పీ వెంకటరావు, ఈస్ట్ డీఎస్పీ సురేందర్‌రెడ్డి అలిపిరి సీఐ అబ్బన్న, ఎస్ఐలు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా ఊంజల్‌సేవ



ఊంజల్ సేవలో పాలకమండలి చైర్మన్

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో శనివారం పౌర్ణమిని పురస్కరించుకుని ఊంజల్ సేవ కన్నులపండువగా నిర్వహించారు. మొదట ఆలయ అలంకార మండపంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించారు. అనంతరం ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. వెన్నెల కాంతుల్లో ఊరేగుతున్న స్వామి, అమ్మవార్లను దర్శించుకుని భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఆర్డీవో రామారావు తదితరులు పాల్గొన్నారు.

కారుణ్య నియామకం

తిరుపతి క్రైమ్: విధి నిర్వహణలో మృతి చెందిన ఇద్దరు హోంగార్డ్ కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకం కింద ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి శనివారం ఉద్యోగాలు కల్పించారు. విధి నిర్వహణలో మృతి చెందిన హోంగార్డ్ 134 గోవింద్‌రెడ్డి భార్య నిర్మలకు, హోంగార్డ్ విజయ్‌కుమార్ 1668 అబ్బాయి తరుణ్ కృష్ణకు కారుణ్య నియామకం కింద ఉద్యోగ ఉత్తర్వులు అందించారు. ఏఎస్పీ వెంకటరావు, హోంగార్డు డీఎస్పీ లక్ష్మణ్‌కుమార్ పాల్గొన్నారు.

అంతా మా ఇష్టం!



తిరుపతి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో కొందరు అధికారులు, మరికొంతమంది సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. మామూళ్లకు అలవాటుపడిన వారు నిబంధనలను తుంగలో తొక్కేస్తున్నారు. విలువైన భూములను ఇతరులకు అప్పనంగా రిజిస్ట్రేషన్లు చేసి వివాదాలకు తెరలేపుతున్నారు. అవినీతి, అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులే ఆదేశాలు జారీచేసినా పట్టించుకునే వారు లేరు. తాజాగా సిబ్బంది బదిలీల విషయంలోనూ నిబంధనలు తుంగలో తొక్కారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

- తిరుపతి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇష్టారాజ్యం
- పాత రికార్డులు చించినా పట్టించుకోరు
- ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కి రిజిస్ట్రేషన్లు
- అవినీతి అధికారులను సస్పెండ్ చేయమన్నా చేయని వైనం
- బదిలీల నుంచి తప్పించుకుని తిష్టవేసిన తిమింగలాలు
- సర్కారుకి తప్పుడు నివేదికలు ఇస్తున్న ఇద్దరు అధికారులు

సాక్షి, తిరుపతి: తిరుపతి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంతోపాటు, జిల్లా వ్యాప్తంగా ఉన్న రిజిస్ట్రార్ కార్యాలయాల్లో కొంత మంది సిబ్బంది, అధికారులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. లంచాలు మరిగిన కొందరు అడ్డదిడ్డంగా వ్యవహరిస్తూ ప్రభుత్వ ఖజానాకు గండికొడుతున్నారు. తిరుపతి అర్బన్ పరిధిలోని సర్వే నం.242/బీలో కోట్లాది రూపాయల విలువచేసే 4.6 ఎకరాల మఠం భూమిని ప్లాట్లు వేసి 34 రిజిస్ట్రేషన్లు చేశారు. మరో ఆరు రిజిస్ట్రేషన్ పత్రాలు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రభుత్వ సూచనలను తప్పుదోవ పట్టించారు. కోట్ల రూపాయలు ముడుపులు పుచ్చుకుని ఇష్టారాజ్యంగా రిజిస్ట్రేషన్లు కానిచ్చేశారు. ఈ తంతుపై రిజిస్ట్రేషన్ కార్యాలయంలో పనిచేసే కొందరు ప్రభుత్వానికి సమాచారం ఇవ్వగా.. విచారణకు ఆదేశించింది. ఈ క్రమంలో అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీచేసినా.. ఇద్దరు అధికారులు ఆవిషయాన్ని బయటపెట్టకుండా తొక్కిపెట్టడం విమర్శలకు తావిస్తోంది.

పేజీలు చించేసినా చర్యల్లేవ్

తిరుపతి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలోని తిరుపతి రూరల్ మండలం, దామినేడు భూములకు సంబంధించి ఓ పేపర్‌ని చించివేశారు. 1972 నాటి రికార్డులోని 21, 22 పేజీలను చించివేసి.. అందులో భారీ విలువచేసే మూడు ఎకరాలకు పైగా భూమికి సంబంధించిన వివరాలను తారుమారు చేశారు. ఆ భూములు కొట్టేయడానికి ప్రయత్నించిన టీడీపీ నాయకుడు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలోని కొందరి సహకారం తీసుకుని రెచ్చిపోయాడు. ఆ పేజీని చించివేసి తనకు అనుకూలంగా వేరొక పేపర్‌ని అంటించి ఎంచక్కా ఆ భూమిని తాను కొనుగోలు చేసుకున్నట్లు తప్పుడు రికార్డులు సృష్టించాడు. ఈ విషయాన్ని 'సాక్షి' వెలుగులోకి తెచ్చింది. దీనిపై విచారణ చేపట్టిన ఉన్నతాధికారులు ఆ పేజీ చించివేసిన విషయం వాస్తవమేనని తేల్చారు. పేపర్ చించివేతకు సంబంధించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీచేసినా సబ్‌రిజిస్ట్రార్ అధికార వర్గాలు పట్టించుకోలేదు.

తిష్టవేసిన తిమింగలాలు

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో లంచాలకు రుచిమరిగిన సిబ్బంది కొందరు బదిలీ కాకుండా పైరవీలు చేస్తున్నారు. వీరి కారణంగా పలువురు నిరాశకు లోనవుతున్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పనిచేసే ఓ ముఖ్య అధికారి కారణంగా తమకు అన్యాయం జరిగిందని బాధితులు వాపోతున్నారు. అన్ని ప్రభుత్వశాఖల్లో బదిలీలు జరుగుతున్నా రిజిస్ట్రార్ కార్యాలయాల్లో మాత్రం దీర్ఘకాలికంగా ఒకేచోట తిష్టవేసి ఉన్న అధికారులను బదిలీ చేయలేకపోతున్నారు. రిక్వెస్ట్ లెటర్లు పెట్టుకున్న వారిలో తిరుపతి జిల్లా పరిధిలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పనిచేస్తున్న సీనియర్, జూనియర్, క్లర్క్, అటెండర్లు మొత్తం 10 మందికిపైగా బదిలీ కావాల్సి ఉంది. వీరిలో లంచాలకు అలవాటు పడ్డ ఓ ఐదుగురు ప్రస్తుతం ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి బదిలీపై వెళ్లడానికి ఇష్టపడడంలేదు. దీర్ఘకాలికంగా పనిచేస్తున్న వారంతా కలిసి పైరవీలు నెరిపినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. రిక్వెస్ట్ లెటర్స్ పెట్టుకున్నా.. వాటిని బయటపెట్టలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న వారంతా అదే స్థానంలో ఉండాలని కోరుకుంటున్నట్లు, అందుకే బదిలీలు అవసరం లేదని ప్రభుత్వానికి తప్పుడు నివేదిక ఇచ్చినట్లు విశ్వసనీయ సమాచారం.

> **కేసులు పెట్టమన్నాం**
>
> సాధారణ బదిలీల విషయంలో రిక్వెస్ట్ లెటర్లు పెట్టుకున్న వారిని బదిలీ చేయమని ఆదేశాలున్నాయి. దీర్ఘకాలంగా పనిచేస్తున్న వారిని బదిలీ చేయాలి. రిక్వెస్ట్ లెటర్లను పరిగణనలోకి తీసుకుని డీఆర్ బదిలీలు చేయాలి. తిరుపతి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఉన్న రికార్డులోని పేజీల చించివేతపై క్రిమినల్ కేసులు నమోదు చేయమని డీఆర్‌ని ఆదేశించాము. నిబంధనలకు విరుద్ధంగా చేసిన రిజిస్ట్రేషన్లకు సంబంధించిన విషయం ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావాల్సి ఉంది.
>
> – గిరిబాబు, డీఐజీ

ప్రజాప్రతినిధులకు చెవిరెడ్డి ధమాకా!

- సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు ఉచిత వైద్య బీమా
- రూ.5 లక్షల వరకు నగదు రహిత వైద్య సేవలు
- రూ.9 లక్షల సొంత నిధులు వెచ్చించిన ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి
- మండల సర్వసభ్య సమావేశంలో ప్రీమియం అందజేత
- మండలంలో రూ.79.05 కోట్ల అభివృద్ధి పనులు
- ప్రభుత్వ విప్, తుడా చైర్మన్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి వెల్లడి



ఆరోగ్య బీమా పత్రాలను అందుకున్న సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్: తండ్రి సంకల్పాన్ని అందిపుచ్చుకుని తండ్రికి తగిన తనయుడుగా చంద్రగిరి ప్రజల చేత శభాష్ అనిపించుకుంటున్నాడు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి. గ్రామాల అభివృద్ధి, పేదల సంక్షేమం కోసం తపించిన ఆ యువనేత వినూత్న రీతిలో దూసుకుపోతున్నారు. ఇప్పటికే రైతుల కోసం వివిధ మండలాల్లో మార్కెట్ సెస్‌ను సొంత నిధులు చెల్లించి ఆదుకున్న ఆయన, ఆటో కార్మికుల కోసం వివిధ ప్రాంతాల్లో గేట్ రుసుమును సైతం చెల్లించి వారికి బాసటగా నిలిచారు. తాజాగా తాను ప్రాతినిధ్యం వహిస్తున్న తిరుపతి రూరల్ మండల పరిధిలోని ప్రజాప్రతినిధుల ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌ల కుటుంబాలకు ఆరోగ్య భద్రత కల్పించారు. ఏదైనా అనారోగ్యం వస్తే రూ.5 లక్షల వరకు వారి కుటుంబాలకు ఉచితంగా వైద్యం అందించేలా ఆరోగ్య బీమా చేయించారు. అందుకు రూ.9 లక్షల సొంత నిధులను వెచ్చించారు. శనివారం జరిగిన తిరుపతి రూరల్ మండల సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులకు ఆరోగ్య బీమా పత్రాలను అందించారు.

రాష్ట్రంలోనే ప్రథమం

రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా ప్రజాప్రతినిధులకు ఉచితంగా ఆరోగ్య బీమా చేయించిన మండలంగా తిరుపతి రూరల్ మండలం నిలిచింది. మండల పరిధిలోని జెడ్పీటీసీ, మండల కో–ఆప్షన్ సభ్యురాలు, 34 మంది సర్పంచ్‌లు, 39 మంది ఎంపీటీసీలకు ఉచిత వైద్య బీమా సదుపాయాన్ని కల్పించారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కూడా ఎంపీపీ మోహిత్ రెడ్డి సేవాగుణాన్ని అభినందించారు. చంద్రగిరి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా నియోజకవర్గంలో మిగిలిన ఐదు మండలాల్లోని ప్రజాప్రతినిధులకు నగదు రహిత వైద్య సేవలందించేందుకు చొరవ తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. దేశంలోనే మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రుల్లో వైద్య సేవలు పొందవచ్చని వెల్లడించారు.

రూ.79కోట్లతో అభివృద్ధి పనులు

తిరుపతి రూరల్ మండల పరిధిలోని వివిధ పంచాయతీల్లో రూ.79 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తెలిపారు. శనివారం తిరుపతి రూరల్ మండల ప్రజాపరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. 50 ఏళ్లలో జరగని అభివృద్ధిని నాలుగేళ్లలోనే చేసి చూపామన్నారు. ప్రతి పంచాయతీ అభివృద్ధి చెందాలి.. ప్రభుత్వ పాలనలో కులం, మతం, పార్టీలకు అతీతంగా ప్రజలకు మంచి చేయాలని సూచించారు. రోడ్లు, కాలువలు, ధ్యాన మందిరాలు, సమావేశ మందిరం, రచ్చ బండలు, జిమ్‌లు, పార్కులు తదితర పనులను చేపట్టామన్నారు.

గైర్హాజరైన అధికారులపై ఎమ్మెల్యే అసహనం

మండల సమావేశానికి ముందస్తు సమాచారం ఇచ్చినా గైర్హాజరైన అధికారుల పట్ల ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. హాజరు కాని అధికారులపై చర్యలకు జిల్లా కలెక్టర్‌కు ప్రతిపాదించాలని సూచించారు. ప్రజా ప్రతినిధులను గౌరవించ లేని వ్యవస్థలో ఉన్నామా.. అని ప్రశ్నించారు.

ప్రతి పల్లె అభివృద్ధి

ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో విభాగాల వారీగా పంచాయతీల్లో నెలకొన్న సమస్యలు, చేపట్టిన అభివృద్ధి పనులపై కూలంకశంగా చర్చించారు. రెవెన్యూ, విద్యుత్, రహదారులు, పంచాయతీ, పోలీస్ తదితర శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ భవనాలు సకాలంలో నిర్మాణాలు పూర్తి చేయాలని ఎంపీపీ మోహిత్ రెడ్డి అధికారులకు సూచించారు. అనంతరం వినతులు స్వీకరించారు. సమావేశంలో వైస్ ఎంపీపీలు వేముల యశోధ, విడుదల మాధవరెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

అధైర్యపడొద్దు..అండగా ఉంటాం



ప్రయాణికులతో మాట్లాడుతున్న ఎంపీ గురుమూర్తి

తిరుపతి అర్బన్: 'ప్రయాణికులకు అండగా ఉంటామని.. ఎవరూ ఆందోళన చెందకండి' అని తిరుపతి ఎంపీ గురుమూర్తి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఒరిస్సా రైలు ప్రమాదం నేపథ్యంలో బాధితుల కోసం ఎంపీ తిరుపతి రైల్వేస్టేషన్‌కు చేరుకుని రెండు గంటల పాటు విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా హెల్ప్‌డెస్క్‌ను పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం ప్రయాణికులతో మాట్లాడారు. సమస్యలుంటే రైల్వే అధికారులకు తెలియజేయడానికి స్టేషన్‌లో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామన్నారు. రైల్వే అధికారులు ప్రయాణికులకు ఇబ్బందుల్లేకుండా అన్ని ఏర్పాటు చేపట్టాలని స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణను ఆదేశించారు. హోరా ఎక్స్‌ప్రెస్‌లో తిరుపతి రైల్వే స్టేషన్ నుంచి 18 మంది, రేణిగుంట రైల్వే స్టేషన్ నుంచి 8మంది, గూడూరు నుంచి ఇద్దరు ప్రయాణికులు, తిరుపతి నియోజకవర్గస్థాయిలో మొత్తం 28 మంది ప్రయాణించారని తెలిపారు. ఒకరిద్దరు మినహా మిగిలిన వారు ఏసీ బోగీల్లో ప్రయాణం చేశారని వెల్లడించారు. ఏసీ బోగీల్లో ఉన్న ప్రయాణికులు సురక్షితంగా ఉన్నారని తెలిపారు. అనంతరం మోడల్ రైల్వే స్టేషన్ పనులను పరిశీలించారు. రైల్వే స్టేషన్‌లోని దుకాణదారులు సైతం స్టేషన్ అధికారులు నిర్ణయించిన ధరలకే వస్తువులను విక్రయించాలని చెప్పారు. ఎంపీతోపాటు సూళ్లరుపేట మునిసిపల్ చైర్మన్ దబ్బాల శ్రీమంత్ రెడ్డి, తిరుపతి రైల్వే స్టేషన్ డైరెక్టర్ సత్యనారాయణ, కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్, స్టేషన్ మాస్టర్ చిన్నరెడ్డెప్ప తదితరులు ఉన్నారు.



తెప్పపై ఊరేగుతున్న శ్రీవారి దేవేరి (ఇన్‌సెట్) విశేష అలంకరణలో అమ్మవారు

విహరిస్తూ..అలరిస్తూ!



గజ వాహనంపై ఊరేగుతున్న శ్రీవారి దేవేరి

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి తెప్పోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. శనివారం పద్మావతి అమ్మవారు తెప్పపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఇందులో భాగంగా ఉదయం అమ్మవారికి సహస్రనామార్చన, నిత్యార్చన నిర్వహించారు. మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పద్మ పుష్కరిణి వద్ద గల నీరాడ మండపంలో అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. సాయంత్రం తెప్పోత్సవం వైభవంగా జరిగింది. ఇందులో అమ్మవారు మూడు చుట్లు తిరిగి భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం శ్రీ పద్మావతి అమ్మవారు గజవాహనంపై ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగి భక్తులను అనుగ్రహించారు. తెప్పోత్సవాల్లో ఏఈవో రమేష్, సూపరింటెండెంట్ శేషగిరి, ఆలయ అర్చకులు బాబుస్వామి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సుభాష్ పాల్గొన్నారు.

లారీ ఢీకొని మహిళ మృతి

గూడూరు: జాతీయ రహదారి సమీపంలో మోటార్ సైకిల్‌ను లారీ ఢీకొన్న ఘటనలో మహిళ మృతి చెందింది. వివరాలు.. కొడవలూరు మండలం, తలమంచి గ్రామానికి చెందిన షేక్ సుల్తానా (48) తన కుమారుడు షాన్‌వాజ్‌తో కలిసి, మోటార్ సైకిల్‌పై వెంకటగిరిలోని బంధువుల ఇంటికి వెళ్లి తిరుగు పయనమయ్యారు. ఈ క్రమంలో వారు సాదూపేట కూడలి ప్రాంతం నుంచి మినీ బైపాస్ మీదుగా జాతీయ రహదారిపైకి చేరుకున్నారు. ఆలా కొంత దూరం వెళ్లే సరికి, వెనుక నుంచి వస్తున్న లారీ వారిని, ఓవర్‌టేక్ చేసే క్రమంలో అదుపుతప్పి ఢీకొంది. ఈ ఘటనలో సుల్తానా అక్కడికక్కడే మృతి చెందగా, ఆమె కుమారుడు స్వల్పంగా గాయపడ్డాడు.

ఫైనల్స్‌కు చేరిన చంద్రగిరి ఐపీఎల్




సరదాగా క్రికెట్ ఆడుతున్న వైఎస్సార్‌సీపీ మీడియా, సోషల్ మీడియా రాష్ట్ర కో-ఆర్డినేటర్ సజ్జల భార్గవ్, ఫైనల్స్‌కు చేరిన అముదాలకోన గిరిజన కాలనీ జట్టు

- గెలుపు కోసం హోరాహోరీగా తలపడిన జట్లు
- పరుగుల వర్షం కురిపించిన బ్యాట్స్‌మెన్లు
- క్రికెట్ మ్యాచ్‌లను వీక్షించిన సజ్జల భార్గవ్

తిరుపతి రూరల్: కనుచూపుమేర మైదానం.. కళ్లు మైమరిపించే ట్రోఫీలు.. వెయ్యి జట్లు.. పదిహేను వేల మంది క్రీడాకారులు.. 16 క్రీడా మైదానాలు.. రోజుకు నాలుగు మ్యాచ్‌లు.. 100 మంది అంపైర్లు.. ఉదయం 7 నుంచి రాత్రి 7గంటల వరకు నిరంతరం భోజన వసతి.. క్రీడాకారులకు, అంపైర్లకు మజ్జిగ, చల్లని తాగునీటి సరఫరా.. మ్యాచ్‌లు ఆడుతున్న క్రీడాకారులకు శక్తినిచ్చే ఓఆర్ఎస్ఎల్ ప్యాకెట్లు.. వెరసి పండుగ వాతావరణంలో క్రీడాసంబరాలు మిన్నంటాయి. తుమ్మలగుంట వేదికగా గత నెల 14వ తేదీ నుంచి జరుగుతున్న వైఎస్సార్ గ్రామీణ క్రికెట్ టోర్నమెంట్ మండల స్థాయి పోటీలు (చంద్రగిరి ఐపీఎల్ క్రికెట్ టోర్నీ) ఫైనల్స్‌కు చేరాయి.

చంద్రగిరి నియోజకవర్గ వ్యాప్తంగా గ్రామీణ ప్రాంత యువతలోని క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీయడానికి చంద్రగిరి నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి నిర్వహించిన చంద్రగిరి ఐపీఎల్ క్రికెట్ టోర్నీ ప్రారంభం నుంచి 13 గ్రౌండ్లలో రోజుకు నాలుగు మ్యాచ్‌ల చొప్పున 52 మ్యాచ్‌లను నిర్వహించారు. శనివారం జరిగిన పోటీలలో చంద్రగిరి, పాకాల, రామచంద్రాపురం, ఎర్రావారిపాళెం, చిన్నగొట్టిగల్లు మండలాలకు చెందిన జట్లు ఫైనల్స్‌కు చేరుకోగా తిరుపతి రూరల్ మండలానికి చెందిన కొన్ని జట్లు సెమీఫైనల్స్‌కు వచ్చాయి.

క్రికెట్ టోర్నీని వీక్షించిన సజ్జల భార్గవ్

తిరుపతి రూరల్ మండలం, తుమ్మలగుంట వేదికగా జరుగుతున్న చంద్రగిరి ఐపీఎల్ క్రికెట్ టోర్నమెంట్‌కు శనివారం వైఎస్సార్‌సీపీ మీడియా, సోషల్ మీడియా రాష్ట్ర కో-ఆర్డినేటర్ సజ్జల భార్గవ్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. బాల, బాలికల క్రికెట్ అసోసియేషన్ ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్యదర్శి చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డితో కలిసి క్రీడామైదానాల్లో బైక్‌పై సందర్శించారు. క్రీడాకారులను ప్రోత్సాహించేందుకు బ్యాట్‌పట్టి సరదాగా క్రికెట్ ఆడారు. టాస్ వేసి పోటీలను ప్రారంభించారు. ఒక్క చంద్రగిరి నియోజకవర్గం నుంచి 15 వేల మంది క్రికెట్ క్రీడాకారులను ఒకే వేదికపైకి తీసుకురావడం గొప్ప విషయమని, అది ఒక్క చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి మాత్రమే సాధ్యమైందంటూ అభినందనలు తెలిపారు.

ఫైనల్స్‌కు చేరిన జట్లు ఇవీ

- ఎర్రావారిపాళెం మండలం నుంచి బోడేవాండ్లపల్లికి చెందిన పి.వడ్డిపల్లి ఎలవెన్స్ జట్టు, రుకువారిపల్లికి చెందిన బబ్లూ ఎలవెన్స్ జట్టు ఫైనల్స్‌కు చేరుకోగా నెరబైలుకు చెందిన నెరబైలు 1, నెరబైలు 2 జట్లు మూడు, నాలుగు స్థానాల్లో నిలిచాయి.
- చిన్నగొట్టిగల్లు మండలం నుంచి దిగువూరుకు చెందిన ఎస్ఎస్‌కె జట్టు, భాకరాపేటకు చెందిన రాయల్ ఫైటర్స్ జట్టు ఫైనల్స్‌కు చేరుకోగా, చిన్నగొట్టిగల్లు సీఎస్‌కె జట్టు, ఎగువూరుకు చెందిన బాబీ ఎలవెన్స్ జట్లు మూడు, నాలుగు స్థానాల్లో నిలిచాయి.
- పాకాల మండలం నుంచి ఇరంగారిపల్లికి చెందిన హిట్ మెన్ ఎలవెన్స్ జట్టు, పాకాలకు చెందిన మున్నా ఎలవెన్స్ జట్లు ఫైనల్స్‌కు చేరుకోగా, గానుగపెంటకు చెందిన జీజీపీ వారియర్స్, దామలచెరువుకు చెందిన డీఎంసీ హైస్కూల్ గేట్ జట్లు మూడు, నాలుగు స్థానాలకు చేరాయి.
- రామచంద్రాపురం మండలం నుంచి సి.రామాపురం ఎలవెన్స్ జట్టు, సీకే పల్లి పంచాయతీ జట్టులు ఫైనల్స్ కు చేరుకోగా కొత్తవేపకుప్పం నుంచి వీపీకే ఎలవెన్స్, నడవలూరు ఎలవెన్స్ జట్లు మూడు, నాలుగు స్థానాలకు చేరుకున్నాయి.
- చంద్రగిరి మండలం నుంచి కల్ రోడ్డుపల్లి నుంచి కింగ్స్ ఎలవెన్స్ జట్టు, చంద్రగిరికి చెందిన మురళి ఎలవెన్స్ జట్టులు ఫైనల్స్‌కు చేరుకోగా, రాయలపురం నుంచి రాయల్ ఎలవెన్స్, తొండవాడకు చెందిన తొండవాడ గ్లాడియేటర్స్ జట్టులు మూడు, నాలుగు స్థానాలకు చేరాయి.
- తిరుపతి రూరల్ మండలం పరిధిలో జట్లు ఎక్కువగా రావడంతో సెమీఫైనల్స్ పోటీలు ఇంకా కొనసాగుతున్నాయి.